క్లుప్తంగా

దత్తాత్రేయుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

తేనెటీగల పెంపకానికి మహానంది మండలం ఎంపిక


మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

మహానంది: మహానంది మండలాన్ని తేనెటీగల పెంపకం యూనిట్‌కు ఎంపిక చేశామని డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుక్కాపురంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ ప్రతి కుటుంబ కనీసం రెండు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతోపాటు అరటి, పసుపు, మొక్కజొన్న తదితర పంటలు పండుతున్న కారణంగా తేనె ఉత్పత్తికి మంచి వనరులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్, ఏపీఓ తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి


విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ ఏఎంఓ బీవీ మల్లేశ్వరరావు

నందికొట్కూరు: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డిప్యూటీ ఏఎంఓ బీవీ మల్లేశ్వరరావు అన్నారు. గురువారం పగిడ్యాల మండలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు లక్ష్యాలు, భవిష్యత్తుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ ఉన్నారు.

అలరించిన ప్రవచనం


ప్రవచనం చెబుతున్న శ్యామలానంద

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ప్రవచన కార్యక్రమం అలరించింది. ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై గురువారం గుంటూరుకు చెందిన పాలపర్తి శ్యామలానంద వారు భ్రమరాంబికా వైభవంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

రైతులకు మొక్కల పంపిణీ


రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికి 80 శాతం మంది రైతులు మొక్కలు నాటారని ఇంకా ఎవరికైనా కావాలంటే పొలం పట్టాదార్ పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను, ఏపీఓను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

పాములపాడు: ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శిఏ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు బి.రామేశ్వర రావు, ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి డి.సోమన్న పాల్గొన్నారు.

హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి గంగాధర్ తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్సలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్సలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్యపర్యవేక్షకులు రాముడు, హ్యాండ్స్ పీఎం నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులోని తోటగేరిలో వెలిసిన గణనాథుడు


తిమ్మాపురంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

గణపయ్యా.. నీ బంటు నేనయ్యా!

- గ్రామగ్రామానా కొలువైన గణనాథుడు
- వైభవంగా వినాయచవితి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న ప్రజలు

ఆది దేవుడు వినాయకుడు గ్రామగ్రామానా కొలువయ్యాడు. వివిధ రూపాల్లో వెలిసిన గణనాథుల ప్రతిమలకు భక్తులు పూజలు చేస్తున్నారు. భక్తి పాటలతో పల్లెలు మారుమ్రోగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వినాయక చవితి వేడుకల్లో మునిగిపోయారు. మంటపాల్లో కొలువైన శివపార్వతుల పుత్రుడికి భక్తులు అర్చకుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం మరోసారి పూజలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతుండటంతో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని ప్రతి పల్లెలో ఆధ్యాత్మికత ధ్వనిస్తోంది.
– మహానంది


మహానందిలో కొలువుతీరిన గణనాథుడికి పూజలు

మహానంది మండలంలో..

మహానంది మండలంలో బుధవారం నుంచి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహానంది పుణ్యక్షేత్రంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆలయంలో కొలువైన గణపతి మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతలు ముడిమెల రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బమ్మల సహకారంతో విగ్రహాన్ని నెలకొల్పారు. ఎం.తిమ్మాపురంలో యువకుడు పడకండ్ల అశోక్ కుమార్ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహం, చిన్నారుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన గంగా, గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి మూర్తికి వెయ్యి లడ్డూలతో అభిషేకం చేశారు.

- జూపాడుబంగ్లా: వినాయక చవితి పర్వదినాన్ని మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, తర్తూరు, మండ్లెం, 80బన్నూరు, తరిగోపుల, తూడిచెర్ల, పారుమంచాల, పోతులపాడు, భాస్కరాపురం, పి.లింగాపురం గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.


జూపాడుబంగ్లాలో వినాయకునికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


వినాయక మండపం వద్ద కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సిఐ,ఎస్ఐ

- పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక ప్రతిమలను బుధవారం ఏర్పాటు చేసి పిండివంటలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు గ్రామాల్లో పర్యటించి వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసిన మండపాలను పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. మండలంలో 70 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కొలువుదీరిన గణనాథులు

- ఆత్మకూరు: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంతోపాటు అంబాభవానీ, శివాలయం, అమ్మవారిశాల సమీపంలోనూ తోటగేరి, మెయిన్‌బజారు, కప్పలకుంట్ల, అర్బన్ కాలనీ, నవాజ్ ఏరియా, పాత పోస్టాఫీసు వీధి, సాయిబాబానగర్, ఏకలవ్యనగర్ తదితర ప్రాంతాల్లో 40 విగ్రహాలు కొలువుదీరాయి. ఈ యేడాది అమ్మవారిశాలలో, తోటగేరిలో వెలిసిన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కరివేన, నల్లకాల్వ, బాపునంతపురం, అమలాపురం, కృష్ణాపురం, వెంకటాపురం, సిద్ధాపురం, వడ్లరామాపురం, కురుకుంద తదితర గ్రామాల్లోనూ గణనాథులను కొలువుదీర్చారు.


ఆత్మకూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో కొలువుదీరిన గణనాథుడు

- నందికొట్కూరు: కాలుష్యం నివారణ కోసం పట్టణంలోని కోటా వీధికి చెందిన భక్తులు కాగితాలతో తయారు చేసిన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. నందికొట్కూరులో 60, నందికొట్కూరు మండంలోని పల్లెల్లో 78, మిడుతూరు మండలంలో 53 విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు.



నందికొట్కూరులోని కోటా వీధిలో వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు


- వెలుగోడు: వెలుగోడు పట్టణంలో 40, మండలంలోని గ్రామాల్లో 40 చోట్ల గణనాథులు కొలువుదీరారు. గురువారం పట్టణంలోని వినాయక మండపాలను ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ సందర్శించి, పూజలు నిర్వహించారు. అనంతరం మంటపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నరసింహస్వామి అవతారంలోని గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


వెలుగోడులోని మంటపాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ


నందికొట్కూరులోని సంగయ్యపేటలో పూజలు అందుకుంటున్న గణతాథుడు


కొత్తపల్లిలో వెలసిన వినాయకుడి విగ్రహం


బండిఆత్మకరులో కొలువైన గణనాథుడు


గువ్వలకుంట్ల బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం


సంకిరేణిపల్లెలో కొలువుదీరిన వినాయకుడు


మిడుతూరులో పూజలందుకున్న గణేషుడు

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు



బుక్కాపురంలో తనిఖీలు చేస్తున్న అధికారులు, కృష్ణారావు పేటలో తనిఖీ చేస్తున్న మండల అధికారులు

మహానంది: రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆమె బుక్కాపురంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. అనుమతులు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొనసాగుతున్న తనిఖీలు

పాములపాడు: మూడు రోజులుగా మండలంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు తనిఖీలు చేస్తున్నారు. గురువారం కృష్ణారావు పేట గ్రామంలోని మూడు దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, బిల్ బుక్‌లను పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ ఖాజాబీ ఉన్నారు.

తగ్గిన భక్తుల సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో వినాయకచవితి పర్వదినం ఉత్సవాలతో పాటు వర్షాలు ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. గురువారం భక్తులు లేక ఆలయ ప్రాంగణాలు వెలవెలబోయాయి. వచ్చిన కొద్దిపాటి మంది భక్తులు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా జీవించండి

బండిఆత్మకూరు: వివాదాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి సూచించారు. గురువారం ఆయన బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, కేసు డైరీలు, లాకప్‌లు, ఆయుధాల గదులను పరిశీలించారు. నేరాల స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలని, వారి సమస్యలు వీలైనంత త్వరగ పరిష్కరించాలని సూచించారు. అనంతరం సమస్యల పరిష్కారం కోసం స్టేషన్‌కు వచ్చిన నారాయణపురం, చిన్న దేవలాపురం గ్రామాల రైతులతో మాట్లాడారు. పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని, మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలని సూచిచారు.


స్టేషన్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి


ఆత్మకూరులో అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


నందికొట్కూరులో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు


పాములపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం కోరారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక గౌడ్ సెంటర్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 ఆగస్ట్ 28న కరెంట్ చార్జీల పెంపునకు వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న వారిపై అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న ఇదే చంద్రబాబు నాయుడు కర్కశంగా పోలీసులతో కాల్పులు జరిపించి ముగ్గురి మరణానికి కారకులయ్యారన్నారు. మరో 25 మంది సీపీఎం నాయకులు, కార్యకర్తలు గాయాల పాలయ్యారన్నారు. సంస్కరణల పేరుతో సామాన్యుడిని సమిధలు చేస్తూ కార్పొరేట్ లాభాల కోసం జనం జేబులకు చిల్లు పెడుతూ ప్రజాభిప్రాయాన్ని పక్కనపెట్టి దర్జాగా ధరలు పెంచుతున్న దురంహంకార పాలకులపై ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి సుధాకర్, రైతుసంఘం మండల కార్యదర్శి మాబాషా తదితరులు పాల్గొన్నారు.

- వెలుగోడు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం బషీర్‌బాగ్ అమరుల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు సీఐటీయూ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, మండల కార్యదర్శి నాగమోహన్, నాయకులు వెంకటయ్య సుబ్రహ్మణ్యం, కిశోర్, కృష్ణ, శేఖర్, మన్సూర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.
- నందికొట్కూరు: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా తలపెట్టిన బషీర్‌బాగ్ ఉద్యమంపై జరిపిన పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన అమరవీరులు త్యాగాలు మరవలేనివని ప్రజా సంఘాల నాయకులు నరసింహులు, నాగేశ్వరరావు అన్నారు. గురువారం పటేల్ సెంటర్‌లో అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళుల్పరించారు.
- పాములపాడు: పోలీసుల కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వమని సీపీఎం మండల కార్యదర్శి డి.సోమన్న అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బషీర్‌బాగ్ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బి.రామేశ్వర రావు, రాజశేఖర్, నాయకులు టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపితే పతనం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు, సీపీఎం మండల కార్యదర్శి కర్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జూపాడుబంగ్లాలో విద్యుత్ అమరవీరులకు సీపీఐ, సీపీఎం నాయకులు నివాలులు అర్పించారు.

మహానంది మండలంలో కుండపోత వర్షం


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం


ఎద్దులేరు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి

మహానంది: మహానంది మండలంలో గురువారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కుండపోత వర్షం కురిసింది. పలు దఫాలుగా భారీ వర్షం కురవడంతో భక్తులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. లోతట్టు కాలనీల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బొల్లవరం గ్రామంలో రామయ్య ఆచారికి చెందిన మట్టిమిద్దె పడిపోయింది. అదృష్టవశాత్తూ అతడు అక్కడ లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. మసీదుపురంలోనూ ఓ మట్టి మిద్దె కూలినట్లు గ్రామస్తులు తెలిపారు.

కొత్తపల్లి మండలంలో 22.8 మి.మీల వర్షపాతం

కొత్తపల్లి: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు వర్షం కురిసింది. 22.8 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడిప్పుడే అధిక వర్షాల నుంచి తేరుకుంటున్న వరి, మొక్కజొన్న పొలాలు మళ్లీ వర్షం కురవడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి పెరగడంతో మూడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో వరి పొలాలు నీట మునిగాయి. ఎద్దు లేరును తహసీల్దార్ ఉమారాణి పరిశీలించారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని ఆమె ప్రజలకు సూచించారు.

పగిడ్యాల మండలంలో 36.8 మి.మీ

పగిడ్యాల: మండల వ్యాప్తంగా 36.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. కృష్ణానదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నందున శ్రీశైలం బ్యాక్‌వాటర్ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న వారు ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు.

జూపాడుబంగ్లా మండలంలో 28.8 మిల్లీమీటర్లు..

జూపాడుబంగ్లా: బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు మండలంలో 28.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


బొల్లవరంలో పడిపోయిన మట్టిమిద్దె

నందికొట్కూరును కర్నూలులో కలపాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: కర్నూలు జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గాన్ని కలపాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. గురువారం పటేల్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు జిల్లాను వదిలేసి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గాన్ని కలపడం తగదన్నారు. ఏదైనా పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు గాబ్రియేల్, ఏసన్న, సుధాకర్, శీలన్న, స్వామన్న, సోమన్న, లక్ష్మిదేవి, ముర్తుజాబి, మల్లమ్మ, రామకృష్ణ, నరసింహులు, సామన్న, శ్రీనివాసులు, కిరణ్, సాయి పాల్గొన్నారు.